క్లుప్తంగా

నీటి నాణ్యత పరీక్షలు



నీటి పరీక్ష చేస్తున్న వైద్య సిబ్బంది

గణపవరం: వాతావరణం మారి భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి ఆదేశాల మేరకు ఆదివారం గణపవరం మండలం గణపవరం, పిప్పర పీహెచ్‌సీల పరిధి గ్రామాల్లో మంచినీటి పరీక్షలు నిర్వహించారు. ఆయా గ్రామాల్లో రక్షిత మంచి నీటి సరఫరా పథకాల ద్వారా ప్రజలకు అందిస్తున్న నీటి నాణ్యతను పరీక్షించారు. నీటిని క్లోరినేషన్ చేసిన తర్వాతే ప్రజలకు సరఫరా చేయాలని పీహెచ్‌సీ సీహెచ్‌ఓ జాలాది విల్సన్ పంచాయతీ సిబ్బందికి సూచించారు. అన్ని గ్రామాల్లో మంచినీటి పరీక్షలు చేసి ట్యాంకు శుభ్రంచేసిన తేదీలను తప్పకుండా ప్రదర్శించాలని సూచించారు.

గుండెపోటుతో కేరళ సిస్టర్ ఎల్సీ మృతి

దెందులూరు: దెందులూరు ఆర్‌సీఎం యూపీ పాఠశాలలో టీచర్‌గా పనిచేసిన కేరళ రాష్ట్రానికి చెందిన సిస్టర్ ఎల్సీ (76) శనివారం గుండె పోటుతో పెదవేగి మండలం ప్రకాష్‌నగర్‌లోని సిస్టర్స్ హోంలో మృతి చెందారు. 25 ఏళ్లుగా ఆంధ్రా ప్రాంతానికి వచ్చి పలు మిషనరీ సంస్థల్లో ఉపాధ్యాయురాలుగా, ప్రత్యేక అవసరాలు గల చిన్నారులకు సేవకురాలుగా, ఆధ్యాత్మిక అభివృద్ధికి విశేష సేవలందించారు. ఆమె మృతిపట్ల ఏలూరు ఆర్‌సీఎం పీఠాధిపతి పొలిమేర జయరావు, ప్రొవిన్షియల్ సుపీరియర్ లీజా స్టెబస్టియన్, అసిస్టెంట్ ప్రొవిన్షియల్ మరీథెరిజ్, వికార్ జనరల్ ఫాదర్ డాక్టర్ బాల, సెయింట్ జాన్స్ డెంటల్ కాలేజీ కరస్పాండెంట్ ఫాదర్ జి.మోజెస్, దెందులూరు ఆర్‌సీఎం యూపీ స్కూల్ ప్రిన్సిపల్ సిస్టర్ టీనామరియా, దెందులూరు ఫాదర్ జీ. అమ్మన్‌రాజా సంతాపం తెలియజేశారు. రెండు నిమిషాలు మౌనం పాటించారు.

ఉచిత వైద్యసేవలను వినియోగించుకోవాలి

దెందులూరు: ప్రభుత్వంతోపాటు స్వచ్ఛంద సంస్థలు అందిస్తోన్న వైద్యసేవలను ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని దెందులూరు వైస్ ఎంపీపీ వేమూరి జితేంద్ర, సోమవరప్పాడు సర్పంచ్ సరిగే నాగరాజు అన్నారు. ఆదివారం సోమవరప్పాడులో భావనాంజలి ప్రథమ చికిత్సా ప్రాంగణంలో ఏలూరు శ్రీ కృష్ణ హాస్పిటల్ వైద్యులు, సిబ్బంది ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. 116 మందికి రక్త, ఎముకలు, సాధారణ పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందించారు. కార్యక్రమంలో డాక్టర్లు బి.కృష్ణ, వరప్రసాద్, పట్నాయక్, ఆనంద్ వైద్య సేవలందించారు. ఆసుపత్రి మేనేజర్ నాగేశ్వరరావు తదితరులున్నారు.

తుదిదశకు కైకలూరు రోడ్డు పనులు

- పల్లపు ప్రాంతాల్లో సీసీ రోడ్డుగా అభివృద్ధి
- అక్టోబర్ చివరి నాటికి అందుబాటులోకి రానున్న రోడ్డు



మాదేపల్లి వద్ద కైకులూరు రోడ్డును సీసీరోడ్డుగా అభివృద్ధి చేసిన దృశ్యం



శ్రీపర్రు కాజ్‌వే వద్ద నిర్మించిన వంతెన

ఏలూరు రూరల్: కైకులూరు రోడ్డు నిర్మాణ పనులు తుది దశకు చేరుకున్నాయి. వర్షాల వల్ల పనులకు ఆటంకం ఏర్పడినప్పటికీ 90 శాతం పూర్తి చేశారు. రోడ్డు మార్జిన్ వెడల్పు చేయడంతో రోడ్డు మరింత విస్తరించింది. రోడ్డు లోతట్టున ఉన్న మాదేపల్లి, లింగారావుగూడెం, శ్రీపర్రు గ్రామ పరిసరాల్లో బీటీ రోడ్డుకు బదులు మూడు కిలోమీటర్ల సీసీరోడ్డుగా అభివృద్ధి చేశారు. మహేశ్వరపురం వద్ద మరో 200 మీటర్ల సీసీరోడ్డు పనులు చేయాల్సుంది. మరోపక్క మూడు కిలోమీటర్ల బీటీరోడ్డు ఫస్ట్ లేయర్ పూర్తి చేశారు. వర్షాకాలం వెళ్లగానే సెకెండ్‌లేయర్ వేయనున్నారు. మహేశ్వరపురం పరిసరాల్లో బురదనేల వద్ద రోడ్డు కోతకు గురికాకుండా రివెంట్‌మెంట్ నిర్మించారు. రోడ్డుకు రెండు పక్కల కాలువ నీరు పారేందుకు మధ్యలో కల్వర్టులు ఏర్పాటు చేశారు. మొత్తంగా ఈ పనుల కోసం ప్రభుత్వం సుమారు రూ.17 కోట్ల నిధులు విడుదుల చేసిన సంగతి తెలిసిందే. ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి కృషి కారణంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈ రోడ్డు అభివృద్ధికి నిధులు మంజూరు చేశారని వైఎస్సార్ సీపీ నాయకులు చెబుతున్నారు. అక్టోబర్ చివర నాటికి ఈ రోడ్డును ప్రారంభించేందుకు కృషి చేస్తున్నామని ఆర్‌అండ్‌బీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ వైవీ కిషోర్‌బాబుజీ చెప్పారు.

శ్రీపర్రు కాజ్‌వే వద్ద వంతెన

కైకులూరు రోడ్డు అభివృద్ధి పనుల్లో శ్రీపర్రు కాజ్‌వే వద్ద వంతెన ఎంతో ప్రాధాన్యత సంతరించుకుంది. ఏటా వర్షాకాలం, వరదల సమయంలో కాజ్‌వే నుంచి వాహనాల రాకపోకలకు ఇబ్బందులు ఏర్పడేవి. కాజ్‌వే లోతట్టుగా నిర్మించడంతో పాటు రోడ్డు మలుపుగా ఉండడంతో పలుసార్లు వాహనాలు తమ్మిలేరులోనికి బోల్తాపడ్డాయి. ఈ ప్రమాదాల్లో సుమారు 10 మంది ప్రయాణికులు ప్రాణాలు కోల్పోయారు. ఈ నేపథ్యంలో కాజ్‌వే వద్ద వంతెన ఎత్తుగా, మలుపు లేకుండా, వర్షాకాలం, వరద తాకిడి తట్టుకుని, ప్రయాణానికి ఆటంకాలు ఏర్పడకుండా నిర్మిస్తున్నారు. ఇప్పటికే వంతెన నిర్మాణం 90 శాతం పూర్తయింది.

సుఖంగా ప్రయాణం



కైకులూరు రోడ్డు అభివృద్ధి సంతోషదాయకం. లోతట్టు ప్రాంతాలతో పాటు శ్రీపర్రు గ్రామ వద్ద సీసీ రోడ్డు వేయడం బాగుంది. మరో 20 ఏళ్ల వరకూ రోడ్డు మన్నిక కలిగేలా నాణ్యతలో ఎక్కడా రాజీ పడకుండా అధికారులు పనులు చేస్తున్నారు. ప్రయాణికులు ఒడిదుడుకులు లేకుండా సుఖంగా ప్రయాణం చేయవచ్చు.

– మండల కొండలరావు, శ్రీపర్రు

ఎమ్మెల్యే కృషి ఎంతో ఉంది



టీడీపీ హయాంలో కైకులూరు రోడ్డు అభివృద్ధికి నోచుకోలేదు. ప్రజలు ఎన్నిసార్లు మొరపెట్టుకున్న నాయకులు పట్టించుకోలేదు. ఏళ్ల తరబడి గోతులపడ్డ రోడ్డుపై ప్రజలు ప్రయాణం చేసి ప్రజలు ప్రమాదాల బారిన పడ్డారు. ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి కృషితో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం రూ.17 కోట్లు విడుదల చేసింది. త్వరలో రోడ్డు అందుబాటులోకి వస్తుందని భావిస్తున్నాం. ఇదే క్రమంలో కొల్లేరు రోడ్డు బాగు చేసేందుకు సైతం ఎమ్మెల్యే నిధులు విడుదల చేయించారు.

– పెన్మత్స శ్రీనివాసరాజు, ఎంపీపీ

ఫ్రీజర్ బహూకరణ



రామకృష్ణను సన్మానిస్తున్న మానవత సభ్యులు

గణపవరం: మానవత స్వచ్ఛంద సంస్థ చేస్తున్న సేవా కార్యక్రమాలకు దాతలు తమ వంతు సహకారం అందించాలని మానవత సంస్థ జిల్లా మాజీ అధ్యక్షుడు సాగిరాజు జానకిరామరాజు అన్నారు. హైదరాబాద్‌లో స్థిరపడిన గణపవరానికి చెందిన సింగులూరి రామకృష్ణ మానవత గణపవరం మండల శాఖకు ఫ్రీజర్ కొనుగోలు నిమిత్తం ఆదివారం రూ.75 వేలు ఆర్థిక సహాయం అందజేశారు. ఈ సందర్భంగా దాత రామకృష్ణను మానవత సభ్యులు దుశ్శాలువాతో సన్మానించి, జ్ఞాపిక అందజేశారు. మానవత రీజియన్ చైర్మన్ కాకర్ల వినాయక మాట్లాడుతూ తన మిత్రుడు రామకృష్ణ అడిగిన వెంటనే ఫ్రీజర్ కొనుగోలుకు రూ.75వేలు అందించడంపై అభినందనలు తెలిపారు. ప్రతి గ్రామంలోనూ దాతల సహకారంతో ఒక ఫ్రీజర్ ఏర్పాటు చేయాలన్న లక్ష్యంతో పనిచేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో మానవత మండల అధ్యక్ష, కార్యదర్శులు, సభ్యులు పాల్గొన్నారు.

క్రికెట్ విజేత బ్లూ జట్టు

ఉంగుటూరు: క్రికెట్ పోటీలు యువతకు ఉత్సాహాన్ని, ఉల్లాసాన్ని కలిగిస్తాయని పుప్పాల కార్తీక్ అన్నారు. ఆదివారం నారాయణపురంలో ముగిసిన క్రికెట్ పోటీల్లో విజేతలకు బహుమతులను ఆయన పంపిణీ చేశారు. విజేతగా నిలిచిన బ్లూ టీముకు షీల్డుతోపాటు రూ.20 వేల నగదు అందజేశారు. రన్నర్స్‌గా నిలిచిన కిల్లర్స్ జట్టుకు షీల్డుతోపాటు రూ.15 వేల నగదు అందజేశారు. ఈ పోటీలను పుప్పాల కార్తీక్ పర్యవేక్షణలో బంకు శ్రీను, ఎంపీటీసీ సభ్యుడు బందారు నాగరాజు, హరివిల్లి మహాలక్ష్మి, దానయ్య, వార్డు సభ్యుడు నేదూరి గంగాధర్‌రావు, గ్రామ వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు పైడి అరుణకుమార్, మతుకుమిల్లి శ్రీధర్, పైడి వరప్రసాదు ఆధ్వర్యంలో పోటీలు నిర్వహించారు. మొదటి బహుమతి నగదును ఐస్ పరిశ్రమల సంఘం అధ్యక్షుడు పొత్తూరి శ్రీనివాసరాజు స్పాన్సర్ చేశారు. రెండో బహుమతి షీల్డ్, నగదును ఆర్గనైజర్లు అందజేశారు. బహుమతి ప్రదానోత్సవంలో నిర్వాహకులతోపాటు పుప్పాల కార్తీక్, పొత్తూరి శ్రీనివాసరాజు, ఉప సర్పంచి అడపా శ్రీను, సీపాని బాలు పాల్గొన్నారు.

చర్మకారులు పిల్లలను విద్యావంతులను చేయాలి



చర్మకారుల సమావేశంలో మాట్లాడుతున్న హరికృష్ణ

ఏలూరు (టూటౌన్): ప్రభుత్వం ప్రవేశ పెట్టిన ఇంగ్లిషు మీడియం విద్యను అందిపుచ్చుకునే విధంగా చర్మకారులు తమ పిల్లలను విద్యావంతులను చేయాలని చర్మకారుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పొలిమేర హరికృష్ణ పిలుపు నిచ్చారు. స్థానిక గన్‌బజారులోని చర్మకారుల సంఘ కార్యాలయంలో ఆదివారం సాయంత్రం నిర్వహించిన సమావేశంలో హరికృష్ణ మాట్లాడారు. చర్మకారులు కాలానికి అనుగుణంగా జీవన స్థితిగతులను మెరుగుపర్చుకోవాలని కోరారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పేదల పిల్లలు ఆర్థిక ఇబ్బందులతో చదువుకు దూరం అవుతున్నారని భావించి వేల కోట్లు ఖర్చు చేస్తూ వివిధ సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారని చెప్పారు. తోళ్ల షాపులు, పరిశ్రమలు మూతపడి తోలు కొనుగోలు కేంద్రాలు లేక చర్మకారులు స్థితిగతులు అధ్వానంగా ఉన్నాయన్నారు. చర్మకారుల సమస్యలు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు త్వరలో చర్మకారుల రాష్ట్ర సదస్సును నిర్వహించనున్నట్లు వెల్లడించారు. సమావేశంలో సోదిమల్ల నాగరాజు, పొలిమేర రాజు, కటారి నాగేశ్వరరావు,రాజేష్, చింతాటి వెంకి, పలువురు చర్మకారులు పాల్గొన్నారు.

నిధుల దుర్వినియోగంపై విచారణ జాప్యం తగదు

దెందులూరు: దెందులూరు గ్రామ పంచాయతీ వివాదం రోడ్డెక్కింది. ఆదివారం వైఎస్సార్‌సీపీ దెందులూరు అధ్యక్షుడు పోకల రాంబాబు నివాసంలో వైఎస్సార్‌సీపీ ప్రజాప్రతినిధులు, వార్డు మెంబర్లు, నాయకులు సమావేశమయ్యారు. దెందులూరు మండల సచివాలయాల కన్వీనర్, పార్టీ జిల్లా కార్యదర్శి కట్టా ఏసుబాబు మాట్లాడుతూ దెందులూరు గ్రామంలో నిధుల దుర్వినియోగంపై చేపట్టిన విచారణలో జాప్యం తగదని అన్నారు. దెందులూరు, అలుగులగూడెం, అప్పారావుపాలెం, సత్యానారాయణపురం గ్రామాల్లో వసూలు చేసిన పన్నుల నగదు ట్రెజరీకి జమ చేయకపోవడం, దీనికి సంబంధించిన రికార్డులు లేకపోవడం దారుణమన్నారు. మూడేళ్ల నుంచి వసూలు చేసిన పన్నుల నగదు ఎవరు కాజేశారని ఏసుబాబు ప్రశ్నించారు. నిధుల దుర్వినియోగంపై విచారణ విషయంలో నాన్చివేత ధోరణితో వ్యవహరించడంపై అనుమానాలు వ్యక్తం చేశారు. ప్రజల నగదుకు అధికారులు పరిరక్షకులుగా, బాధ్యులుగా ఉండాలన్నారు. ఒక పంచాయతీ, మూడు శివారు ప్రాంతాల్లో వసూలు చేసిన పన్నుల నగదును ఎవరు ట్రెజరీలో జమ చేస్తారని, ఎవరు బాధ్యత వహిస్తారన్నారని ప్రశ్నించారు. పార్టీ గ్రామ అధ్యక్షుడు పోకల రాంబాబు, సొసైటీ చైర్మన్ కొలుసు గణపతిరావు, ఏఎంసీ డైరెక్టర్ పులిపాటి శ్యామలాదేవి, వార్డు మెంబర్ కృష్ణవేణి, పార్టీ నాయకులు కమ్ముల రవి, మెండేం ప్రకాశరావు మాట్లాడుతూ సోమవారం కలెక్టర్ వద్దకు వెళ్లి లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేస్తామన్నారు.

దిరిశాల వరప్రసాద్‌కు సత్కారం



వరప్రసాద్‌ను మెమెంటోతో సత్కరిస్తున్న బీసీ సంక్షేమ సంఘం నాయకులు

ఏలూరు (టూటౌన్): ఏపీ ఫార్మసీ కౌన్సిల్ సభ్యునిగా ఎన్నికైన సందర్భంగా వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు, ఏపీ మెడికల్ బోర్డు డైరెక్టర్ దిరిశాల వరప్రసాద్‌ను జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఏలూరు అర్బన్ అధ్యక్షుడు లక్కోజు రాజగోపాలాచారి ఆధ్వర్యంలో ఆదివారం సత్కరించారు. వరప్రసాద్‌కు ఆయన ఫొటోతో ఉన్న మెమెంటోను అందజేశారు. ఈ సందర్భంగా రాజగోపాలాచారి మాట్లాడుతూ ఏలూరులో సీనియర్ వైద్యుడిగా పేదలకు ఉచితంగా వైద్యం చేస్తూ ఉండే వ్యక్తి వరప్రసాద్ అన్నారు. ఆయన సేవలకు గుర్తింపుగా ప్రభుత్వం ఫార్మసీ కౌన్సిల్ సభ్యునిగా నియమించడం అభినందనీయమన్నారు. జిల్లా నలుమూలలా ఉన్న పేదలకు ఏ కష్టం వచ్చినా అందుబాటులో ఉంటూ 24 గంటలు ప్రజాసేవ చేసే వ్యక్తి వరప్రసాద్ అని కొనియాడారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, మాజీ మంత్రి, ఎమ్మెల్యే ఆళ్ల నాని ఆశీస్సులతో భవిష్యత్తులో మరింత ఉన్నతమైన పదవులు పొందాలని ఆకాంక్షించారు. పలువురు బీసీ సంఘాల నాయకులు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో తూర్పుకాపు సంఘం అధ్యక్షుడు అబ్బిరెడ్డి రంగముత్యాలు, యువజన నాయకుడు ఈదలాడ నాని తదితరులు పాల్గొన్నారు.

పళ్లెం ప్రసాద్‌కు పరామర్శ

దెందులూరు: అనారోగ్యంతో వైద్యసేవలు పొందుతున్న ఫారెస్ట్ కార్పొరేషన్ స్టేట్ డైరెక్టర్, వైఎస్సార్ సీపీ సీనియర్ నేత పళ్లెం ప్రసాద్‌ను ఆదివారం ఆయన నివాసంలో ఏపీ ఆయిల్‌ఫెడ్ మాజీ చైర్మన్ కొఠారు రామచంద్రరావు, రాణి, జెడ్పీ చైర్‌పర్సన్ గంటా పద్మశ్రీ ప్రసాద్, దెందులూరు ఏఎంసీ చైర్మన్ అప్పన్న ప్రసాద్ పరామర్శించారు. ఆయన ఆరోగ్యవైద్యసేవలు గురించి కుటుంబ సభ్యులను అడిగి తెలుసుకున్నారు. త్వరితగతిన సంపూర్ణ ఆరోగ్యంతో కోలుకోవాలని ఆకాంక్షించారు.

కాపు విద్యార్థులకు పతకాల అందజేత



ప్రతిభ చూపిన కాపు విద్యార్థులతో నిర్వాహకులు

ఏలూరు (టూటౌన్): కాపు సంక్షేమ సేన ఆధ్వర్యంలో ఏలూరు నగరంలో 100 మంది ఉత్తమ ప్రతిభ గల కాపు విద్యార్థులకు రజిత పతకాలను అందజేశారు. ఆదివారం నిర్వహించిన సభకు అధ్యక్షత వహించిన సంఘం జిల్లా అధ్యక్షుడు పులి శ్రీరాములు మాట్లాడుతూ 10వ తరగతిలో 500కు పైగా, ఇంటర్‌లో 900కు పైగా మార్కులు సాధించిన విద్యార్థులను ప్రోత్సహించేందుకు ఈ కార్యక్రమం నిర్వహించామని చెప్పారు. తొలుత కాపు సంక్షేమ సేన మహిళా అధ్యక్షురాలు మామిడిపల్లి కృష్ణకుమారి జ్యోతి ప్రజ్వలన చేశారు. ముఖ్యఅతిథులుగా హాజరైన నగర ప్రముఖులు నారా శేషు, పాలి ప్రసాద్, పూజారి నిరంజన్, శిరిపల్లి ప్రసాద్, చోడగిరి శ్రీనివాస్, రఘుమండ హరినాథ్, శాయన దాశరధి, నందేటి ఆది సురేష్, పోలూరి హరినాథ్, కానాల రామకృష్ణ విద్యార్థులకు రజిత పతకాలను అందజేశారు. కాపు సంక్షేమ సేన జిల్లా, నగర కమిటీల్లో నూతనంగా పదవులు పొందిన పలువురిచే పదవీ ప్రమాణ స్వీకారం చేయించారు. కార్యక్రమంలో పురస్కారాలు అందుకున్న విద్యార్థులు, కాపు సంఘం నాయకులు పాల్గొన్నారు.

సోలార్ లైట్, సూచిక బోర్డు ఏర్పాటు హర్షణీయం



సోలార్ లైట్‌తో గల సూచిక బోర్డు

భీమడోలు: రాష్ట్రీయ రహదారి భీమడోలులోని కోమటికుంట రోడ్డు వద్ద భీమడోలు సత్యసాయి సేవా సమితి నిర్వాహకులు సూచిక బోర్డు, సోలార్ లైట్లు ఏర్పాటు చేసి తమ సేవాగుణాన్ని చాటుకున్నారు. గుండుగొలను నుంచి కొవ్వూరు వరకు జాతీయ రహదారిని నిర్మించడంతో సూర్పగూడెం నుంచి నుంచి భీమడోలు గ్రామానికి వెళ్లే ప్రజలు కోమటికుంట రోడ్డు వద్ద ఎటు వెళ్లాలో అర్థం కాక నానా అవస్థలు పడుతున్నారు. భీమడోలు గ్రామానికి వచ్చే ప్రజలు రాత్రి వేళల్లో మరీ ముఖ్యంగా తికమక పడుతూ గమ్యానికి చేరుకునేందుకు నానా తిప్పలు పడుతున్నారు. ఈ రహదారి వెంబడి నిత్యం వందలాది రాకపోకలు సాగిస్తూ ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయాన్ని గుర్తించిన సత్యసాయి సేవా సమితి భీమడోలు అధ్యక్షుడు వర్ధినేడి సత్యసాయి ఆధ్వర్యంలో రాత్రి వేళల్లో వెళ్లే ప్రయాణికులు, మరీ ముఖ్యంగా గ్రామ ప్రజలు భీమడోలు చేరుకునేందుకు అనువుగా భీమడోలు కోమటికుంట వద్ద ఆదివారం సోలార్ లైట్లు బిగించిన సూచిక బోర్డును ఏర్పాటు చేయడంతో వారంతా హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్నారు. అదే విధంగా రహదారిని ఆహ్లాదకరంగా ఉంచేందుకు పక్కనే పలు రకాల మొక్కలు వేసి వాటిని పెంచుతున్నారు.

గ్రంథాలయంలో చిన్నారుల పుస్తక పఠనం



భీమడోలులో పుస్తక పఠనం చేస్తున్న చిన్నారులు



పెదవేగిలో పుస్తకాలు చదువుతున్న విద్యార్థులు

భీమడోలు: మండలంలోని భీమడోలు, పూళ్ల, గుండుగొలను శాఖా గ్రంథాలయాల్లో ఆదివారం చదవడం మాకిష్టం కార్యక్రమాన్ని నిర్వహించారు. వివిధ పాఠశాల చిన్నారులు పాల్గొని సామూహిక పుస్తక పఠనం చేసారు. భీమడోలు గ్రంథపాలకుడు కె.శ్రీనివాస్ ఆధ్వర్యంలో వివిధ పాఠశాలల బాలబాలికలుకు తాతయ్య మాట చిన్నారులకు చూపిన బాట అనే నీతి కథను వివరించారు. ప్రతి ఒక్కరూ కథలోని నీతిని అనుసరించాలని చిన్నారులకు గ్రంథపాలకులు తెలిపారు. ప్రపంచ స్నేహితుల దినోత్సవం విశిష్టతను వివరించారు. కథలు, జీవిత చరిత్రలు, దినపత్రికలు చదివారు. కార్యక్రమంలో పూళ్ల, గుండుగొలను గ్రంథపాలకులు డీఎస్‌బీ అమర్‌నాథ్, జి.నాగమణి, పెద్దలు పాల్గొన్నారు.

పుస్తక పఠనంతో విజ్ఞానం వృద్ధి

పెదవేగి : గ్రంథాలయాలతో విజ్ఞాన పెంపొందుతుందని పెదవేగి గ్రంథపాలకుడు తోట అరుణ్‌కుమార్ అన్నారు. పెదవేగి శాఖా గ్రంథాలయంలో ఆదివారం విద్యార్థులతో చదవడం మా కిష్టం కార్యక్రమం నిర్వహించారు. దేశానికి ఆదర్శంగా నిలిచిన ప్రముఖుల జీవిత చరిత్రలను విద్యార్థులకు చదివి వినిపించారు. నిత్యం పుస్తక పఠనంతో ప్రయోజనాలు, జ్ఞాపక శక్తిని ఎలా పెంపొందించుకోవాలో అరుణ్‌కుమార్ వివరించారు.

హైందవ సంస్కృతి పరిరక్షణే లక్ష్యం

దెందులూరు: రాజకీయాలకు అతీతంగా ప్రతి ఒక్కరూ భారత ప్రధాని మన్‌కీ బాత్ కార్యక్రమాన్ని విధిగా చూడాల్సి అవసరం ఉందని బీజేపీ ఏలూరు పార్లమెంట్ కన్వీనర్ గారపాటి సీతారామంజనేయచౌదరి అన్నారు. ఆదివారం కొవ్వలిలో 146 బూత్ కమిటీ సభ్యులతో మొటపర్తి భవన్‌లో ఏర్పాటు చేసిన ప్రధాని మోదీ మన్‌కీ బాత్ కార్యక్రమాన్ని నాయకులు తిలకించారు. ప్రధానమంత్రి పిలుపునిచ్చిన పర్యావరణ పరిరక్షణ, తిరుపతి విశ్వ విద్యాలయ పీఠం పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అన్నారు. ప్రతి నెల చివరి ఆదివారం ఈ కార్యక్రమం నిర్వహిస్తామని వివరించారు.

కూరగాయల ధరలు

ఏలూరు నగరంలోని రైతు బజార్లలో కూరగాయల ధరలు

కూరగాయలు	కిలో ధర	కూరగాయలు	కిలో ధర
టమాటాలు	130	అరటి కాయ (1)	05-07
వంకాయలు (గులాబీ)	24	చిక్కుడు కాయలు	40
వంకాయలు (కాంతులు)	32	చామదుంపలు	48
వంకాయలు (తెలుపు)	60	ములక్కాడలు	07-10
బెండకాయలు	40	కంద	40
పచ్చిమిర్చి	72	బీట్‌రూట్	40
కాకర కాయలు	36-50	కీరా దోస	36
బీరకాయలు	40	ఫ్రెంచ్‌బీన్స్	--
బీరకాయలు (పందిరి)	50	అల్లం	180-270
క్యాబేజీ	28	కొత్తిమీర (కట్ట)	20
క్యారెట్	40	పాలకూర	12
దొండకాయలు	16	చుక్కకూర	12
బంగాళదుంపలు	26	తోటకూర	10
ఉల్లిపాయలు	24	గోంగూర	07
గోరుచిక్కుడు	36	పుదీనా	05
దోసకాయలు	24	బఠాణి	--
అనపకాయ (1)	15-20	క్యాప్సికమ్	96
పొట్లకాయ(1)	15	చిలకదదుంప	44

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా విజయవాడ (ఇంద్ర)	21.00	30
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా ఖమ్మం (ఇంద్ర)	21.00	36
ఏలూరు - బీహెచ్‌ఈఎల్ (అమరావతి)	22.00	35
ఏలూరు - తిరుపతి(ఇంద్ర)	19.00	34

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్‌ఈఎల్	21.45	4820	25
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా కే.కోట	19.30	4796	21
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా రామచంద్రపురం	19.45	4798	24
ఏలూరు -జీడిమెట్ల వయా ఖమ్మం	20.15	4804	25
ఏలూరు -ఈసీఐఎల్	22.30	4814	26
ఏలూరు - బీహెచ్‌ఈఎల్	22.15	34820	30
ఏలూరు -బీహెచ్‌ఈఎల్	09.00	4794	రద్దు
ఏలూరు - విశాఖపట్నం	12.00	4840	34
ఏలూరు -విశాఖపట్నం	22.00	4838	రద్దు
ఏలూరు -తిరుపతి	16.00	4830	30

ముంపు పొలాల పరిశీలన



ముంపు పొలాలను పరిశీలిస్తున్న ఏడీఏ



కొవ్వలిలో వరి చేలను పరిశీలిస్తున్న దృశ్యం

దెందులూరు: మండలంలో ఆదివారం సాయంత్రం వ్యవసాయ శాఖ జిల్లా అసిస్టెంట్ డైరెక్టర్ కె.సుబ్బారావు దెందులూరు మండల వ్యవసాయ శాఖాధికారి గద్దె రమేష్ పరిశీలించారు. ఉండ్రాజవరం, పోతునూరు, కొవ్వలి గ్రామాల్లో గత వారం రోజులుగా కురుస్తున్న వర్షాల వల్ల నష్టపోయిన పొలాల వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఫెర్టిలైజర్ బూస్టర్ డోసు, యూరియా 20 కేజీలు, ఎంటీపీ 20 కేజీలు, ఎకరానికి పిచికారీ చేయాలని రైతులకు అసిస్టెంట్ డైరెక్టర్ సూచించారు. గ్రామాల్లో రైతుభరోసా కేంద్రాలు, వ్యవసాయ శాఖ అసిస్టెంట్ల సూచనలు, సలహాలు పొంది సాగులో ప్రభుత్వ సాయం పొందాలన్నారు. దెందులూరు మండల వ్యవసాయ శాఖాధికారి గద్దె రమేష్ మాట్లాడుతూ రెండు గ్రామాల్లో మునిగి పొలాల్లో నీరు దాదాపుగా తొలిగిపోతుందన్నారు. 225 ఎకరాలు ముంపునకు గురైందని వీటిలో కొంతమేర మాత్రమే పాక్షికంగా నష్ట వాటిల్లిందని అసిస్టెంట్ డైరెక్టర్‌కు వివరించారు. వారి వెంట కొవ్వలి, ఉండ్రాజవరం, పోతునూరు గ్రామాల వ్యవసాయశాఖ అసిస్టెంట్లు ఉన్నారు.

పెదపాడు మండలంలో..

పెదపాడు: డ్రెయినేజీల సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళతామని ఏలూరు ఏడీఏ వై సుబ్బారావు తెలిపారు. పెదపాడు మండలంలోని ఖాజీగూడెం, సకలకొత్తపల్లి, సత్యవోలు వీరభద్రపురంలో ఆదివారం పర్యటించారు. ఈకార్యక్రమంలో పంట పొలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులకు పలు సూచనలు సలహాలు అందించారు. ముంపు బారి నుంచి బయటపడిన పొలాల్లో బూస్టర్ డోస్‌గా యూరియా 20 కేజీలు, పొటాష్ 15 కేజీలు చొప్పున వేసుకోవాలని సూచించారు. దీంతో పాటు 19.19.19 ఎకరానికి 1కేజీ చొప్పున చల్లుకోవాలని తెలిపారు. డ్రెయినేజీల సమస్యలపై జిల్లా కలెక్టరు, ఇరిగేషన్ అధికారుల దృష్టికి తీసుకువెళతామని చెప్పారు. ఆయన వెంకట పెదపాడు మండల వ్యవసాయ అధికారి వానపల్లి ప్రదీప్‌కుమార్, వ్యవసాయ సహాయకులు, రైతులు ఉన్నారు.